క్లుప్తంగా

హై స్కూల్ ప్లస్‌లో అడ్మిషన్లు ప్రారంభం



అడ్మిషన్ ప్రత్రాలను చూపుతున్న ఉపాధ్యాయులు

నాగలాపురం: మండల కేంద్రంలోని హైస్కూల్ ప్లస్‌లో అడ్మిషన్లు ప్రారంభమయినట్లు హెచ్‌ఎం కస్తూరయ్య తెలిపారు. బుధవారం ఉపాధ్యాయ బృందం గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యతను వివరిస్తూ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించడమే కాకుండా ఇంటర్మీడియెట్‌లో కుడా జిల్లాలో ఉత్తమ ఫలితాలను సాధించినట్లు తెలియజేశారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్న నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

తెలుగు భాషపై పట్టు ఉండాలి



మాట్లాడుతున్న మునిలక్ష్మి

కార్వేటినగరం: విద్యార్థులకు తెలుగు భాషపై పట్టు ఉండాలని ఉపాధ్యాయరాలు మునిలక్ష్మి అన్నారు. గ్రంథాలయ వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆమె తెలుగు వ్యాకరణంపై అవగాహన కలిగించారు. గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు మాట్లాడుతూ శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐరన్ మాత్రలతో రక్తహీనత దూరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : పిల్లల్లో రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడాలని వైద్యాధికారి మోహన్ కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉప కేంద్రంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత తొలగాలంటే ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. గర్భిణులు నెల సరి వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నీర్పాకోట గ్రామంలో సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో కలుషితమైన నీటి ద్వారా వచ్చే వ్యాధులు, దోమల ద్వారా వచ్చే వ్యాధులు ఉంటాయని తెలిపారు. కలుషితమైన నీరు, ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా టైఫాయిడ్, అతిసారం తదితర వ్యాధులు వస్తాయని, దోమల కారణంగా మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను అరికట్ట వచ్చని తెలిపారు.

నేడు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో గురువారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మోహనప్రియ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లలకు సమయం కేటాయించాలి

రేణిగుంట: తల్లిదండ్రులు పిల్లలపై ప్రేమతో పాటు ఎక్కువ సమయాన్ని కేటాయించాలని రాస్ ప్రాజెక్ట్ అధికారి రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం రేణిగుంట ఇందిరా నగర్‌లో రాస్ సంస్థ చైల్డ్‌ఫండ్ ఆర్థిక సహాయంతో 40 గ్రామాల పిల్లలతో వివిధ రకాల విద్య, అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో చక్కగా మెలగాలని సూచించారు. పిల్లల అభివృద్ధికి కృషిచేయాలని పేర్కొన్నారు. పిల్లలతో ఎలా మెలగాలో బొమ్మల ద్వారా వివరించారు. రీసోర్స్ పర్సన్ శ్రీవత్సవ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కండలేరులో 6.707 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 6.707 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంగమ్మ తల్లీ ..శరణు శరణు



శ్రీకాళహస్తి : ప్రత్యేక అలంకారంలో గంగమ్మ



నారాయణవనం : జాతరలో పాల్గొన్న నూకతోటి రాజేష్

శ్రీకాళహస్తి: పట్టణంలోని బీపీ అగ్రహారంలో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. తిరుపతి జాతర సందర్భంగా ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా బుధవారం బీపీ అగ్రహారంలో వెలసిన గంగమ్మ ఆలయంలో వేడుకలను నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తిని గజమాలతో సుందరంగా అలంకరించి పూజలు చేసి కొలువుదీర్చారు. భక్తులు వెయ్యి కళ్ల దుత్తలతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని ఏఎంపుత్తూరులో కూడా గంగమ్మజాతర వైభవంగా జరిగింది. రాత్రి 9గంటలకు అమ్మవారి నిమజ్జన కార్యక్రమం జరిగింది.

అమ్మవారి సేవలో ఎమ్మెల్సీ

పట్టణంలోని బీపీ అగ్రహారంలో గంగమ్మ జాతరలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయిసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. నిర్వాహకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గంగమ్మకుఅంబలి..చదవాలమ్మకు పొంగళ్లు

సత్యవేడు: పట్టణంలో జాతర సందర్భంగా నడివీధి గంగమ్మకు అంబలి పోసి. చదవాలమ్మకు పొంగళ్లు పెట్టారు. సత్యవేడు జాతరకు 15 రోజుల ముందు చాటింపు వేస్తారు. జాతర ముందు వచ్చే రెండు బుధవారాలు ఆరోగ్య ప్రదాయిని గంగమ్మకు అంబళ్లు పోసి, గ్రామ దేవత చదవాలమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి గ్రామదేవతలు(చెల్లాతమ్మ, అంకమ్మ, నూకాలమ్మ, పోలేరమ్మ, గంగమ్మ)కు నైవేద్యం సమర్పించి హారతులు ఇచ్చారు. తిరుపతి తాతయ్య గుంట గంగ జాతర తరువాత అంతటి ప్రాచుర్యం కలిగిన సత్యవేడు గంగ జాతర ఈ నెల 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగనుంది.

నారాయణవనం: మండలంలోని డీకేపాళెంలో బుధవారం గంగజాతర వైభవంగా జరిగింది. చల్లంగ చూడు గంగమ్మ తల్లి అంటూ భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. వైఎస్సార్ సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ మధ్యాహ్నం జాతరలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలను నిర్వహించి హారతులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతకు మారుపేరుగా జాతరలు జరుగతాయన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సర్పంచ్ స్వర్ణ రామ్మూర్తి, నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, అన్నాదొరై, కిరణ్, బాబు, గోవిందస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లెలో బుధవారం గంగమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి విగ్రహానికి, శూలానికి అభిషేకాలుచేసి, పూలతో అలంకరించి, పూజలు చేశారు. పొంగళ్లు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.



శ్రీకాళహస్తి: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం



సత్యవేడు: విశేష అలంకరణలో చదవాలమ్మ



సత్యవేడు: పొంగళ్లు పెడుతున్న మహిళలు



బుచ్చినాయుడుకండ్రిగలో..

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన నూకతోటి రాజేష్



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నూకతోటి రాజేష్, పిచ్చాటూరు మండల నేతలు

పిచ్చాటూరు: వైఎస్సార్ సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ పిచ్చాటూరు మండల నాయకులతో కలిసి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బుధవారం కలిశారు. తిరుపతిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పిచ్చాటూరు మండలంలో ఎన్నికల సరళితో పాటు సత్యవేడు నియోజకవర్గంలో పోలింగ్‌పై చర్చించారు. పోలింగ్ సరళిని బట్టి వైఎస్సార్ సీపీ విజయం తథ్యంగా కనిపిస్తోందని మంత్రికి రాజేష్ వివరించారు. పార్టీ పిచ్చాటూరు మండల అధ్యక్షుడు కేవీ చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మండల ఉపాధ్యక్షుడు రమేష్ రాజు, సర్పంచ్ కిరణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు శోభన్, నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, చెంగ్రాయ రెడ్డి, సూరిబాబు రెడ్డి, మురళి, విశ్వనాథం, బాబు రెడ్డి, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీకి సర్వం సిద్ధం



పోలీసుస్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నపత్రాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 24 నుంచి 31 వ తేదీ వరకు జరగనున్న పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకోసం గదులు, సౌకర్యాలను సిద్ధం చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం మండలాలకు చెందిన పదవ తరగతి ఫెయిలైన 142 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. తెలుగు పరీక్ష 75 మంది, హిందీ 35 మంది, ఇంగ్లిషు 37 మంది, లెక్కలు 88 మంది, సైన్స్ 88, సోషియల్ 58 మంది రాయనున్నారన్నారు. తాగునీటి సౌకర్యంతోపాటు వైద్య సిబ్బంది అందుబాటు ఉంటారన్నారు. విద్యార్థులకు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. కాగా స్థానిక పోలీసుస్టేషన్‌కు సప్లిమెంటరీ ప్రశ్నపత్రాలు చేరాయి. పరీక్షల చీఫ్‌లు, డిపార్టుమెంట్ అధికారులు పశ్నపత్రాల కట్టలను పరిశీలించి, బాక్సులలో భద్రపరిచి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.

తీరిన దళితవాడ తాగునీటి కష్టాలు




మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కేవీబీపురం: మండలంలోని కళత్తూరు దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్య తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ చొరవతో తీరింది. చేతి బోరు, విద్యుత్ మోటార్ కొద్ది నెలల కిందట మరమ్మతులకు గురైయ్యాయి. మరమ్మత్తుల నిమిత్తం విప్పిన బోరును అధికారులు బిగించకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. గ్రామస్తులు నీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. సమస్యను ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు గ్రామస్తులు మొర పెట్టుకున్నారు. ఎంపీ గురుమూర్తి జిల్లా అధి కారులను సంప్రదించి మండల, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీంతో మంగళవారం సాయంత్రం కళత్తూరుకు చేరిన అధికారులు అర్ధరాత్రి వరకు అక్కడే ఉండి సమస్యను పరిష్కరించారు. ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆగమోక్తంగా నరసింహస్వామికి పూజలు



హోమ పూజలు చేస్తున్న వేదపండితులు



ప్రత్యేకాలంకారంలో లక్ష్మీనరసింహస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధంగా భక్తకనప్ప కొండపై వెలసి ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జయంతి వేడుకలను బుధవారం ఆగమోక్తంగా నిర్వహించారు. ముందుగా కలశ స్థాపన చేసి పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు పలు రకాల అభిషేకాలు నిర్వ హించారు. విశేషంగా అలంకరించి పూజలు చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

రాయంచపై జ్ఞాన ప్రదాయినిగా కటాక్షం



హంస వాహనంపై జ్ఞాన ప్రదాతగా స్వామివారి విహారం

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్వేత వస్త్రాలను ధరించి.. వేదాలను చేతబట్టి సరస్వతీదేవిగా హంస వాహనంపై విహరిస్తూ శ్రీ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శేష వాహనంపై గోసంరక్షణధారిగా భక్తులను అనుగ్రహించారు. వేకువ జామున 4.30 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కార్యక్రమాలు. హోమ పూజలను పూర్తి చేశారు. 7.30 గంటలకు పిల్లనగ్రోవితో వేణుగోపాలునిగా సుగంధభరిత పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో స్వామివారి ఉత్సవమూర్తిని అలంకరించి చిన్న శేష వాహనంపై అధిష్ఠింపజేశారు. తదుపరి మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, డప్పుల వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ స్వామి వారి ఊరేగింపు గ్రామ వీధుల్లో కొనసాగింది. ఆలయానికి చేరుకున్న వెంకన్నకు ఉభయ దేవరులతో ఆగమోక్తంగా స్నపన తిరుమంజనంలో పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం జ్ఞాన సరస్వతీదేవిగా ఊయలలో కొలువుదీర్చి ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు సరస్వతీదేవిగా హంస వాహనంపై కొలువుదీరిన కల్యాణ వెంకన్నకు విశేష పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు తదితరులు పర్యవేక్షించారు. ఉత్సవాల్లో మూడవ రోజు గురువారం ఉదయం సింహ వాహనంపై, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఆకట్టుకున్న డ్రమ్ముల వాయిద్యాలు

వాహనసేవ ఊరేగింపులో సంప్రదాయ గ్రామీణ డప్పు వాయిద్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రాజమండ్రి, కొవ్వూరు, జగ్గంపేట, కనమిట్టలకు చెందిన 80 మంది సభ్యుల బృందం వాయిద్యాలను లయబద్ధంగా వాయించడం భక్తులను విశేషంగా అలరించింది. అలాగే చిన్నపిల్లలు నృత్యం చేస్తూ అన్నమయ్య కీర్తనలకు కోలాటాలు ఆడుతూ స్వామి వారి వాహనసేవలకు అగ్రభాగాన సాగారు. ఆద్యంతం వాహన సేవలు నేత్రపర్వంగా సాగాయి.



శేష వాహనంపై వేణుగోపాలునిగా...



డ్రమ్ము వాయిద్యాల సందడి



కోలాట నృత్యాలు

సస్యరక్షణతో వేరుశనగలో అధిక దిగుబడి

నింద్ర: ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి తులసీరామ్ అన్నారు. బుధవారం అగరం, ఎలకాటూరు గ్రామాల్లో రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పించారు. సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి వస్తుందని, పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు.

హనుమంతునిపై కరిమాణిక్యస్వామి విహారం



ఊంజల్ సేవలో స్వామివారు



హనుమంతునిపై విహరిస్తున్న స్వామివారు

.-వేడుకగా స్వామి వార్ల చప్పర ఉత్సవం

నాయుడుపేటటౌన్: తుమ్మూరు గ్రామంలో వెలసివున్న శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హనుమంతుని వాహనంపై ఆశీనులై గ్రామ పురవీధులలో విహరించారు. ఉదయం ఆలయం వద్ద టీటీడీకి చెందిన వేదపండితులు స్వామి వార్ల చప్పర ఉత్సవాన్ని నిర్వహించి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామంలోని మాడ వీధుల్లో ప్రతి ఇంటి ముంగిట స్వామి వారిని ఆహ్వానిస్తూ గ్రామస్తులు పూజలు జరుపుకున్నారు. రాత్రి హ నుమంతుని వాహన సేవలో టీటీడీకి చెందిన ఆలయ ఇన్‌స్పెక్టర్‌లు హరిరెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

నేడు గరుడసేవ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో ద్వారదర్శనం పూజలు నిర్వహిస్తారు. రాత్రి స్వామివారిని గరుడ వాహనంలో ఊరేగిస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

వైభవంగా చిన్న కొట్టాయి ఉత్సవం



పురవీధుల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం బుధవారం ఆగమోక్తంగా పరిసమాప్తమైంది. అలంకార మండపంలో స్వామి,అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి ధూపదీపనైవేద్యాలు సమర్పించారు. అనంతరం శ్రీగంగాదేవి, జ్ఞానప్రసూనాంబ సమేతంగా స్వామివారి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి చప్పపరాలపై అధిష్ఠింపజేశారు. తదుపరి మేళతాళాలు, మంగళవాయి ద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లకు అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

కమనీయం.. కల్యాణం



వెంకటగిరిరూరల్: మండలంలోని వల్లివేడు సమీపంలోని 9వ బెటాలియన్ వద్ద కొండపై వెలసియున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 64 జయంతి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఉదయం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. 9వ బెటాలియన్ అధికారులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి నిర్వహించిన చందనాలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం స్వామివారి గరుడోత్సవం నిర్వహించారు.